# కర్తవ్యం

"ఇదిగో, నిన్నే" సింహం గర్జించింది - అదే నరసింహం!

చేతిలో ఉన్న ప్లేటు తక్కున కింద పడింది. పడితే పడింది. వెంటనే రెండు ముక్కలయింది - అది అన్ బ్రేకబుల్ ప్లేట్!

"అలా నిలబడ్డావేం, తియ్యి" నరసింహం ఉగ్ర నరసింహం అయ్యాడు.

చేతులు వణుకుతుంటే శ్రద్ధగా రెండు ముక్కల్ని తీసింది. వీటిని అతికించాలి - ముక్కలు కూడా అందంగానే ఉన్నాయి - అయినా అవి ముక్కలేగా!

విరిగినవి అతికించే ఒక ట్యూబ్ తను ఆ మధ్య కొంది. దాని అట్టపెట్టె మీదున్న అక్షరాలు అప్పుడు చదివినవి ఇప్పుడు గుర్తొచ్చాయి. "జాయిన్స్ ఎవ్రిథింగ్ ఎక్సెప్ట్ బ్రోకెన్ హార్ట్స్" - ఒక్కసారి నవ్వొచ్చింది. కానీ ఇప్పుడు నవ్వకూడదు.

మరో ప్లేట్లో ఉప్మా తెచ్చి ముందరుంచింది.

"అక్కర్లేదు — కాఫీ" పేపర్లోనే ముఖం ఉంచుకున్నాడు నరసింహం. కాఫీ తెచ్చి బల్ల మీదుంచింది — మరెవరో కాదు, రాజ్యం- నరసింహం అర్ధాంగి, ఓ పసికందుకి మాతృమూర్తి.

ఎనిమిదయేసరికి నరసింహం కంపెనీ కెడతాడు. అయితే, ప్రతి రోజూ ఏదో ఒక పేచీ పెట్టుకుంటాడు. చాలాసార్లు భార్యని తిట్టడం కొన్నిసార్లు కొట్టడం, టిఫెన్ ప్లేటు నేలకేసి కొట్టడం, కాఫీ తాగకుండా వెళ్ళిపోవటం అతనికి అలవాటే. ఆ ఇల్లాలు ఇంట్లో ఆ పని ఈ పని చేసుకుని, తినేందుకు మనసు బాగుండక ఆ టిఫెన్ అలా ఉండిపోవటం ఆమెకీ అలవాటే.

ఆ ఇంట్లో గడియారం సరిగ్గా సెకన్లతోసహా టైము తప్పకుండా చూపిస్తుంది – అల్లుతున్న స్వెటర్ ఖంగారుగా ఆపేసి లేచింది రాజ్యం. "ఆయనొచ్చే వేళయింది" – తనలో తనే మాట్లాడుకుంటూ వంటింటి వైపు దారి తీసింది. అతను వచ్చేసరికి అన్నం వేడిగా ఉండాలి. పసివాడు ఏడవ కూడదు. గడియారం గంటలు కొట్టకూడదు – అందుకే గంటలు కొట్టే వైపుకీ ఇవ్వటం మానేసింది. పొద్దున్న పాలవాడుకానీ, మధ్యాహ్నం పోస్ట్‌మాన్ కానీ కేక పెట్టకూడదు – ఆ సమయానికి తనే గుమ్మంలో నిలబడుతుంది.

అతనికి నిద్రాభంగం కాకూడదు – అదీ అసలు విషయం – పిల్లాడు కదిలితే చాలు రాజ్యం - ఆ ఊయల దగ్గరే నిలబడుతుంది ఊపుతూ.

అయితే నరసింహం అప్పుడప్పుడు నరుడిలా కూడా ఉంటాడు. ఆ కొద్దిసేపు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయిపోతుంది రాజ్యం....అయినా ఏదో భయం నీడలా కదులుతూ ఉంటుంది కూడా!

"ఇలా రా" –

భయపడుతూ వచ్చింది రాజ్యం.

"ఊ" – పక్కకి జరిగాడు.

"కూచో" – భుజం మీద చేయి వేసి కూర్చోపెట్టుకున్నాడు భార్యని తన పక్కన నరసింహం.

పిల్లాడు ఏడిస్తే,

పోస్టుమాన్ తలుపు కొడితే –

హమ్మో! ఇంకేమయినా ఉందా – కోపం వచ్చేస్తుంది .... ఆ కోపంతో తనని ఒక్క తన్ను తన్నితే – కింద పడిపోతుంది తను – కాలు విరుగుతుంది – ఇంకేముంది – కుంటి భార్యని ఎవడేలుకుంటాడు అని తనని వదిలేస్తాడు – ఇంక, ఇంకేముంది, మొగుడొదిలేసిన రాజ్యం తను – రాజ్యం భయంగా ఒక్కసారి లేవబోయింది –

"హాయిగా నిద్రపో" – కదలనీయలేదు భర్త.

శరీరం, మనసు అలసిపోయిన రాజ్యం క్షణాలలో నిద్రలోకెళ్ళి పోయింది.

అయితే ఎంత సేపూ!!

"లే" – ఉలిక్కిపడింది రాజ్యం.

"దున్నపోతులా ఆ నిద్దేమిటీ" – సింహం గర్జించింది ....

పెద్ద తప్పు చేసిన దానిలా గబుక్కున లేచింది రాజ్యం. గబ గబా కాఫీ తయారుచేసి తెచ్చింది. అప్పటికి నరసింహం బూట్లువేసుకోటం కూడా అయిపోయింది.

"ఇంత వేడిగా ఎలా తాగుతాననుకున్నావ్ – నువ్వే తాగు" – తలుపు ధనామని వేసి వెళ్ళిపోయాడు నరసింహం.

తలుపు గడియ వేసుకుంది రాజ్యం – బల్లమీద చల్లారిపోయిన కాఫీ కప్పు, బల్ల మీద ఓ పక్కగా పెట్టిన డాన్సింగ్ డాల్ తననే చూసి నవ్వుతున్నాయనిపించింది రాజ్యానికి. రాజ్యం మనసు చాలా కలత చెందింది – ఏమిటీ దాంపత్యం, ఎందుకీ కలసి బతకటం – ఎవరికోసం. తను బానిసలా పడుండాలి – అనుక్షణం భర్తను చూసి భయపడిపోతూ రోజులు గడపాలి – తనేం తప్పు చేసిందని? ఎప్పుడూ అతనికే కోపం ఎందుకు రావాలి, తనకెందుకు రాకూడదు? తనే పిల్లాడికి పాలు కలిపి పట్టాలి – అతనెందుకు పట్టడు? రాజ్యానికి నవ్వొచ్చింది ఒక్కసారి. ఈ ప్రశ్నలకి సమాధానం వెతకటమేమిటో అనిపించింది ....

రాజ్యం కోపంగా ఎదురుగా బల్ల మీదున్న గ్లాసును కింద విసిరేసింది. ఆ చప్పుడికి ఉయ్యాల్లో పిల్లాడు ఉలిక్కిపడి లేచి ఏడవటం మొదలు పెట్టాడు .... పిల్లాడు – వీడూ రేపటి మగాడే!! రాజ్యం ఉయ్యాల తొట్టి లోకి తొంగి చూసింది.

వీధి తలుపు కొడుతున్నారెవరో ....

తలుపు తీయగానే ఎదురుగా పాల రాజయ్య.

"అయ్య లేడా"–

"ఎందుకూ?"

"ఆ పాల పైసలు లెక్క చేస్తానన్నాడు."

"నేను లెక్క చేస్తాలే – ఈ నెలలో ఎక్కువ పాలు పోయించు కున్నామా" – రాజ్యం రాజయ్య వంక చూస్తూ అంది.

రాజయ్య సమాధానం చెప్పలేదు.

"అయ్య వచ్చినాక మళ్ళీ వస్తాలే .... ఆయన సరిగ్గా లెక్క చేస్తడు" – పాల రాజయ్య తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయాడు.

"అంటే" – తను పాల లెక్క కూడా చేయలేదా – దీనికీ అయ్య రావాలి – మరి తను – తనకేం రావు – ఏం తెలియవు – ఒట్టి మొద్దు!! అంతేనా! రాజ్యం కళ్ళు ఎర్రబడ్డాయి.

రాజ్యానికి మనసు చాలా చిరాగ్గా ఉంది.

ఆటో ఎక్కి వెంటనే స్నేహితురాలింటి కొచ్చింది. స్నేహితురా ళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకోటం మొదలు పెట్టారు.

"అయినా ఎంత చిలకా గోరింకల్లా ఉంటే మాత్రం మొత్తం లోకాన్ని మరచిపోతారా – మీ రిద్దరూ మా యింటి కొచ్చారా అసలు" – లలిత అనటం ఆలస్యంగా.

"నిజంగానే మా వారు నేను కలసి మీ యింటికే బయలుదేరాం. అంతలో మా వారి బాబాయిగారు వచ్చారు .... అందుకని నే నొక్కర్తనే

వచ్చాను" - రాజ్యం గ్లాసులో నీళ్ళు తాగేసింది - హమ్మయ్య!! అబద్ధం ఎంతో హాయిగా ఉన్నట్టనిపించింది.

"పోన్లే కాని .... మీ ఆయన నిన్ను బాగా చూసుకుంటాడా?" లలిత ఆడ ముందుకేసుకుని అంది.

"అంటే?"

"అదే - ఊఁ, అదే" చిలిపిగా నవ్వింది లలిత.

"ఏమో బాబూ - నా కవేవీ తెలియవు" రాజ్యం నవ్వింది.

"అంటే నిన్ను ప్రేమగా చూసుకుంటాడా అని - లేకపోతే మగాళ్ళందరిలాగ భార్యంటే వంటింటి కుందేలు, బానిస అని అనుకుం టాడా .... భార్యని ఎవరితో మాట్లాడనీయకుండా ఎవరికీ కనిపించనీయ కుండా, క్షణ క్షణం బాధిస్తూ ఉంటారే ఆ జాతికి చెందుతాడా అని నా ప్రశ్న."

రాజ్యానికి భయమేసి పోయింది - ఈ లలిత పెళ్ళి చేసుకోలేదు. పైగా మగాళ్ళంతా దుర్మార్గులనే దృఢమైన అభిప్రాయం బాగా నాటుకు పోయింది - ఇప్పుడు తను ఇక్కడకు ఎందుకొచ్చిందో పొరబాటున లలిత పసికట్టేసిందా! రాజ్యం ముఖం ఒక్కసారి పాలిపోయింది.

"అబ్బ, అవవే - సంసారం కబుర్లాపి, కాలేజీ కబుర్లు చెప్పు కుందాం."

స్నేహితురాళ్ళిద్దరూ ఐదేళ్ళు కలిసి చదువుకున్న రోజులు తలుచు కుంటూ, కబుర్లు చెప్పుకుంటూ టైము విషయం పట్టించుకోలేదు. అంతలోనే గడియారం గంటలు కొట్టింది. "బాబోయ్ - టైమయిపోయింది"అంటూ హడావిడిగా నిద్రపోతున్న పిల్లాణ్ణి ఎత్తుకుని బయలుదేరింది రాజ్యం.

ఆటోలో కూర్చున్నాక రాజ్యానికి దుఃఖం ఆగలేదు.

చదువుకొనే రోజుల్లో తనకున్న ఆదర్శాలు, తన వ్యక్తిత్వం అన్నీ ఏమైపోయాయో, రాజ్యానికి తల్లి మాటలు గుర్తొచ్చాయి అప్రయత్నంగా. తల్లి గొంతు చెవిలో మారుమ్రోగింది.

ఆ రోజు తల్లితో తను,

"మా ఫ్రెండుతో కలిసి సినిమాకెడతాను" అంది.

"నాకు తెలియదమ్మా, మీ నాన్ననడుగు."

"అమ్మా, రేపు సరోజ, లీల మనింటికి భోజనానికి వస్తారు. ఆ తర్వాత మేమంతా కలిసి సుశీల పెళ్ళి కెడతాము."

"నాకు తెలియదమ్మా, మీ నాన్నగారేమంటారో – ఆయన్నే అడుగు"–

"ఏమిటీ – అన్నిటికీ నాన్నగారినడుగు, నాన్నగారినడుగు – నాన్న ఏమన్నా రాక్షసుడా, నువ్వు భయపడిపోవడానికి.

అయినా ఆడవాళ్ళకి ఒక వ్యక్తిత్వం ఉండాలి. అన్నిటికీ ఇలా భయపడిపోయే పిరికితనముండకూడదు.

అన్నిటికీ గంగిరెద్దులా తల ఊపుతూ. ఛీ, నేను మాత్రం నీలా ఉండను బాబూ, ముందే చెప్తున్నా.... నన్నొక మనిషిలా గుర్తించి గౌరవించక పోతే అసలు ఆ కాపురమే చేయను. అంతే – ఆడవాళ్ళకి సమాన హక్కులు కావాలి – ఆడవాళ్ళకి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కావాలి – ఆడవాళ్లు వంటింటి కుందేళ్లు కావడానికి వీల్లేదు".... రాజ్యం మాటలకి పగలబడి నవ్వింది తల్లి.

"నాకేమయిందిప్పుడు – లక్షణంగా ఉన్నాను" – తల్లి సిగలో మల్లెపూల దండ సరిచేసుకుంటూ అంది నవ్వుతూనే.

రాజ్యానికి తల్లి నవ్వు చెవిలో మారుమోగిందిప్పుడు.

"అమ్మా, వంటింటి కుందేలిని, బానిసని, ఆట బొమ్మని – అన్నీ నేనే, నేనే"–ఆటో గుమ్మం ముందు ఆగింది. రాజ్యం ఆశ్చర్యపోయింది తాళం చూసి. పక్కింటి రాధిక తాళాలు తెచ్చి యిచ్చింది.

లోపలకొచ్చి పిల్లాడిని పడుకోబెట్టి సోఫాలో కూలబడిపోయింది రాజ్యం.

రోజులు గడుస్తున్నాయి. రాజ్యంలో అంతర్మథనం బయలుదేరింది. నరసింహంలో ఎలాటి మార్పూలేదు.

తన జీవితం అంతా ఇదే పద్ధతిలో కొనసాగడానికి వీల్లేదు అని మరీ మరీ అనుకుంది రాజ్యం – కానీ తను ఒక మంచి నిర్ణయం తీసుకోవాలి – ఆ నిర్ణయం తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టాలి. కూలగొట్టకూడదు. రాజ్యం మనసు పెద్ద సంఘర్షణలో కొట్టు మిట్టాడింది. ఈ బానిస కథ ఇక మారాల్సిందే, తప్పదు. రాజ్యం గట్టిగా ఊపిరి తీసుకుంది.

ఆ రోజు బీరువా తీద్దామని వచ్చిన నరసింహం ఉలిక్కిపడి అడుగు వెనక్కి వేశాడు. అక్కడ గూట్లో ఉన్న బక్క పిల్లి పళ్లు బయట పెట్టి గుర్రుమంటోంది నరసింహాన్ని చూసి.

గుమ్మంలో నుంచున్న రాజ్యానికి నవ్వాగలేదు.

విరగబడి నవ్వింది. పిచ్చిగా నవ్వింది. నవ్వలేక నవ్వింది. ఏడ్వలేక నవ్వింది. గుండెలు పిండేట్టు నవ్వింది.

విస్తుపోయి చూస్తున్నాడు నరసింహం.

"ఎందుకా నవ్వు?"

"ఏం, నేను నవ్వకూడదా?"

నరసింహం కళ్ళప్పగించి చూస్తున్నాడు.

రాజ్యం ఇంకా నవ్వుతూనే ఉంది గూట్లో పిల్లి గుర్రుమంటోంది. నరసింహానికి పిల్లిని చూస్తే భయం!!

ఆ నరసింహాన్ని చూస్తే తనకి భయం!!

ఏమిటిది – పిల్లి పీకుతుందని నరసింహానికి భయం – మరి తనకి!! నరసింహం ముఖం అచ్చంగా పిల్లి ముఖం లాగే కనిపించింది రాజ్యానికి. మళ్ళీ గట్టిగా నవ్వింది.

ప్రకృతిలోని గొప్ప రహస్యం అర్థమయిపోయింది ఆ క్షణంలో రాజ్యానికి.

"గదిలో పెట్టి కొడితే పిల్లి కూడా తిరగబడుతుంది" ఎక్కడో చదివిన మాట గుర్తొచ్చింది రాజ్యానికి.

"భయపడే వారిని మరీ భయపెట్టడం, అణిగి ఉండే వారిని మరీ అణచివేయటం ఇదే."

ఎదురు తిరిగితే గజగజ వణికి పోవటం— లేకపోతే!!

రాజ్యం నరసింహంకేసి చూసింది....!

తన కర్తవ్యమేమిటో క్షణంలో బోధపడింది రాజ్యానికి. మనసు తేలికైంది....గూట్లో పిల్లి కిటికీలోంచి దూకింది బయటికి.

బల్లమీదున్న మంచినీళ్ళ గ్లాస్ విసిరికొట్టాడు నరసింహం. ఎందుకో!

బల్లమీదున్న డాన్సింగ్ డాల్ తీసి బయటకి విసిరేసింది రాజ్యం. ఎందుకో!

రోజులు గడుస్తున్నాయి. "ఇప్పుడు నాకేమయింది హాయిగా ఉన్నాను."— ఆ రోజు సిగలో పూలు ముడుచుకుంటూ అన్న తల్లి మాటలు పదే పదే గుర్తుకొస్తున్నాయి. రాజ్యానికి.

"ఏది హాయి, ఏది కాదు, ఏది సత్యం, ఏదసత్యం....ఓమహాత్మా! ఓ మహాత్మా! అనే అంటోందేమిటీ! తను కూడా ఓ మహిళా, మహిళా"— రాజ్యం చేతిలో ఉన్న పుస్తకాన్ని పక్కన పెట్టి తలెత్తేసరికి ఎదురుగా నరసింహం నిల్చున్నాడు.

"ఇదిగో నేను బయటకు వెళుతున్నాను పిల్లాడిని చూసుకోండి. వాడు ఏడిస్తే పాలు కలిపి పట్టండి" అంటూ రాజ్యం చెప్పులు తొడుక్కొని మెట్లు దిగి వెళ్ళిపోయింది, నరసింహం చెప్పే సమాధానం కోసం ఎదురు చూడకుండా.

ఉగ్రనరసింహం ఉరమని పిడుగుని చూసి విస్తుపోతూ, పిల్లాడిని ఎత్తుకుని రాజ్యం వెళ్ళినవైపు చూస్తూ నిలబడ్డాడు.

* [భూమిక, 1994]